● భట్టికి సన్మానం



విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను టీఈఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సచివాలయంలో సోమవారం కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ శివాజీ, కో చైర్మన్ పి.అంజయ్య, రామేశ్వర్‌షెట్టి, నాసర్‌షరీఫ్, కరెంట్‌రావు, లక్ష్మయ్య, శ్యామలరావు, మధు, ప్రవీణ్, హరీశ్‌కుమార్‌తో పాటు సీజీఎంలు మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)

బంజారాహిల్స్‌లో డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సోషలైట్ బీనా మెహతా

బంజారాహిల్స్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లో లేబుల్స్ పాప్- అప్ స్పేస్‌లో డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను సామాజికవేత్త బీనా మెహతా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, డిజైనర్ వేర్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేటి తరం ఫ్యాషన్ ప్రియులకు నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించాలని సూచించారు. డి సన్స్ పటోలా ఆర్ట్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ప్రదర్శన ప్రధాన సామాజిక లక్ష్యమన్నారు. రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 2వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు తమ ఉత్పత్తులను వివిధ రాష్ట్రాల నుంచి ప్రదర్శిస్తున్నాయని, ఈనెల 27వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని వారు తెలిపారు.

కనువిందు చేస్తున్న చేనేత - హస్తకళ ప్రదర్శన



వన్‌గ్రామ్ గోల్డ్ జూవెలరీని చూస్తున్న మహిళలు

అల్లాపూర్, 19 ఆగస్టు (ఆంధ్ర జ్యోతి): మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన 'హ్యాండ్లూమ్ - సిల్క్ ఎక్స్‌పో' ప్రదర్శనకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు వికాస్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని రకాల ఫ్యాషన్ వస్తువులను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు 'హ్యాండ్లూమ్ సిల్క్స్ ఎక్స్‌పో సొసైటీ' ఏర్పాటైందన్నారు. వస్త్ర ప్రదర్శనలో భాగంగా చేనేత వస్త్రాలతో పాటు కశ్మీర్ సిల్క్స్, కళాఖండాలు, వన్ గ్రామ్ గోల్డ్ జూవెలరీ, పేయింటింగ్స్, జ్యూట్ బ్యాగ్స్‌తో పాటు వివిధ రకాల గృహోపకరణాలు ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఆగస్టు 25 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపిన వికాస్ జైన్, ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

రేపు డాన్‌బాస్కో ఆధ్వర్యంలో జాబ్‌మేళా

సనత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఎన్సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) డాన్‌బాస్కో దిశ ఆధ్వర్యంలో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్ తెలిపారు. డాన్‌బాస్కో డిగ్రీ కాలేజీలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూలు చేసి.. ఎంపిక చేస్తామని, మరిన్ని వివరాల కోసం 9494092219 నంబర్‌ని సంప్రదించాలని సూచించారు.

నేడు జీహెచ్‌ఎంసీకి గ్రేటర్ చెన్నైయ్ కమిషనర్ రాక

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నైయ్ కార్పొరేషన్ కమిషనర్ జె.కుమార గురుబారన్, ఐఏఎస్ మంగళవారం జీహెచ్‌ఎంసీని సందర్శించనున్నారు. అధికారిక పర్యటనకు వస్తున్న ఆయన నగర పరిధిలోని శ్మశాన వాటికలు, అర్బన్ క్లీనింగ్‌పై అధ్యయనం చేయనున్నారు. అలాగే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు.

అక్టోబర్‌లో మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్-2024 పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిరణ్మయి అలివేలు తదితరులు

బంజారాహిల్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ 2024-సీజన్-1 అక్టోబర్‌లో జరుగనుంది. సోమవారం షేక్‌పేటలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను వ్యవస్థాపక నిర్వాహకులు కిరణ్మయి అలివేలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదో సాధించాలనే ఉత్సాహం ఉన్న ఔత్సాహిక యువ వనితలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మోడల్స్ నిర్వహించిన ఫ్యాషన్ వాక్ ఆకట్టుకుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 11కేవీ స్టేట్ హోమ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ శాలివాహన నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11కేవీ కమలాపురి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.



యువకులతో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

యువత రాజకీయాల్లోకి రావాలి

బోరబండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లోకి రావాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. వినాయకరావునగర్‌లో జరిగిన యూత్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ సమావేశంలో యూత్ కమిటీ అధ్యక్షుడు లఖాన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌కుమార్, కుమార్, రామకృష్ణ, మహేందర్‌గౌడ్, నరేష్, రాజేష్ పాల్గొన్నారు.



సనత్‌నగర్ బీకేగూడాలో బీజేపీ నాయకులు ఆకుల బాల నరసింహ నివాసానికి వచ్చిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాఖీ కడుతున్న ఆకుల మహేష్ మాతృమూర్తి విజయ



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు రాఖీ కడుతున్న ఫిలింనగర్‌కు చెందిన మహిళలు

ఆనందోత్సాహాల రక్షాబంధన్



టీపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డికి రాఖీలు కట్టిన మహిళలు



కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు రాఖీ కడుతున్న మహిళలు



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కడుతున్న వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ జోన్ బృందం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాఖీపౌర్ణమి వేడుకలు సోమవారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో వాడవాడలా ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. అక్కాచెల్లెళ్లు తమ అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి తమ ప్రేమానురాగాలను చాటుకున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులకు మహిళా కార్పొరేటర్లు, మహిళలు రాఖీ కట్టేందుకు బారులుదీరారు. రాఖీ పండుగను పురస్కరించుకుని పూల దుకాణాలు, స్వీట్ హౌస్‌లు, రాఖీల అమ్మకం దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి.



బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ మూర్తికి రాఖీ కడుతున్న దేవనార్ అంధుల పాఠశాల విద్యార్థినులు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రాఖీలు కడుతున్న మహిళలు



ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుడగజంగం బస్తీలో రాఖీలు కడుతున్న రాఘవేంద్ర తదితరులు



మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మైనారిటీ నాయకురాలు హజరసుల్తానా



బీఆర్‌ఎస్ నాయకులు కూతురు నర్సింహకు రాఖీ కడుతున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి



రాఖీ వేడుకలో అన్నాచెల్లెళ్లు



వినియోగదారుల ఫోరం ప్రధాన కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



స్కూల్‌లో విద్యార్థులకు రాఖీలు కడుతున్న చిన్నారులు



సోదరునికి రాఖీ కడుతున్న చిన్నారులు

నిమ్స్‌లో విధులను బహిష్కరించిన రెసిడెంట్ డాక్టర్లు

సనత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ఆస్పత్రిలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ నిమ్స్ రెసిడెంట్ డాక్టర్లు సోమవారం విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని వైద్యులు స్పష్టం చేశారు. ఫయిమా, ఆర్‌డీఏల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా విధులు బహిష్కరించినట్లు తెలిపారు. ఈనెల 19 నుంచి తమ డిమాండ్‌లు నెరవేర్చే వరకు ఓపీడీ, ఓటీ సర్వీసులు నిలిపివేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.



నిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది



పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రామ్మోహన్ తదితరులు
- సనత్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



సనత్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు కమర్ హమీద్, లక్ష్మి, అశ్విని, విజయలక్ష్మి, సూఫియా, విజయ తదితరులు
- సతన్‌నగర్ (ఆంధ్రజ్యోతి)

పార్కులో పొంచి ఉన్న ప్రమాదం

● బేగంపేట ఎయిర్‌లైన్స్ కాలనీ పార్కులో విరిగి వేలాడుతున్న చెట్టు కొమ్మ
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు



పార్కులో ప్రమాదకరంగా వేలాడుతున్న విరిగిన చెట్టు కొమ్మ

బేగంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని ఎయిర్ లైన్స్ కాలనీ పార్కులో ఇటీవల వీచిన గాలికి భారీ చెట్టుకు ఉన్న పెద్ద కొమ్మ విరిగి ప్రమాదకరంగా వేలాడుతోంది. వాకింగ్ ట్రాక్ ఉన్న ప్రాంతంలోనే ఈ కొమ్మ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాకర్స్ భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదకరంగా వేలాడుతున్న కొమ్మను తొలగించాలని ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ అసోసియేషన్ అసిస్టెంట్ కార్యదర్శి ఎజే శ్రీనివాస్, రాజేందర్‌కుమార్ ఇటీవల జీహెచ్‌ఎంసీ ఆర్టికల్చర్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అయినా, అధికారులు కొమ్మను తొలగించలేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విరిగి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌డెస్క్ నంబర్ 155326

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌డెస్క్‌ను మూసివేశారు దానికి ప్రత్యామ్నాయంగా పీడబ్ల్యూడీ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేశారు. ట్రాన్స్‌జెండర్స్ తమ సమస్యలను 155326 నంబర్‌కు తెలియజేయాలని సంబంధిత అధికారులు సూచించారు.

కిలిమంజారోను అధిరోహించిన నగర విద్యార్థి

● పిన్నవయస్కునిగా రికార్డు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రీతం గోలి(16) మౌంట్ కిలిమంజారోను అధిరోహించాడు. నగరం నుంచి ఈ ఫీట్‌ను సాధించిన అతి పిన్నవయస్కునిగా రికార్డులకెక్కాడు. ఎనిమిది రోజుల పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని మౌంట్ కిలిమంజారోను జూలై 17న అధిరోహించినట్లు ప్రీతం తెలిపారు. ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్న అతను సత్యరూప్ సిద్ధాంత్ మార్గదర్శకత్వంలో నలుగురు క్లైంబర్స్‌తో ఈ యాత్ర పూర్తి చేశాడు. కిలిమంజారో పర్వతంపై జాతీయ పతాకంతో పాటుగా ఎన్‌సీసీ ఫ్లాగ్, తన స్కూల్ ఫ్లాగ్‌ను ఎగురవేసినట్లు తెలిపాడు. ఈ పర్వతాన్ని అధిరోహించిన తొలి ఎన్‌సీసీ కేడెట్ కూడా తానే అని ఈ సందర్భంగా అతను వెల్లడించాడు.



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న ప్రీతం తదితరులు

బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్ లాక్ చేసుకున్న బాలుడు

● కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

సనత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్‌ను లాక్ చేసుకున్న రెండేళ్ల బాలుడిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. సనత్‌నగర్ ఎస్‌ఆర్టీ కాలనీలో నివసిస్తున్న షేక్ షరీఫ్ కుమారుడు హసిల్ మొహిద్దీన్ ఆడుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్‌లాక్ చేసుకున్నాడు. తలుపు తెరవడం తెలియక ఏడ్చుకుంటూ ఉండిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారి సాయంతో 20 నిమిషాల పాటు బెడ్‌రూం డోర్ తెరిచేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. వెంటనే 101కు సమాచారం ఇచ్చారు. సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని తలుపు పగలగొట్టి బాలుడిని కాపాడారు.

వేడినీటిలో పడిన చిన్నారి మృతి



అక్షర (ఫైల్)

పేట్‌బషీరాబాద్ , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేడి నీళ్లలో పడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రిమృతి చెందింది. పేట్‌బషీరాబాద్ అడ్మిన్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి మున్సిపల్‌లోని అశ్వినికాలనీలో సురేష్, రత్న దంపతులు నివాసం ఉంటున్నారు. సురేష్ కూలి పని చేస్తుంటాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈనెల 9న ఉదయం 9 గంటలకు అక్షర(3)కు స్నానం చేయించేందుకు ఆమె తల్లి బాత్‌రూంలోకి తీసుకెళ్లింది. ఇంట్లోకి వెళ్లి సబ్బు తీసుకొచ్చే లోపే పాప ఏడుపు వినిపించింది. తల్లి వెళ్లి చూసేసరికి ప్రమాదవశాత్తు అక్షర వేడినీటి బకెట్‌లో పడిపోయింది. దీంతో తీవ్ర గాయాలైన చిన్నారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయింది. కుటుంబ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

అమీర్‌పేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి బైకుపై వెళ్తున్న యువకుడిని కారు ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట మోతిలాల్ నెహ్రూనగర్‌కు చెందిన ప్రసాద్(19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం కార్మికనగర్‌లో ఉండే బంధువుల ఇంటికి వెళ్లి వారితో కలిసి మెదక్ చర్చికి వెళ్లి రాత్రికి తిరిగి కార్మికనగర్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి ప్రసాద్ తన బైకును తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

అర్ధరాత్రి 1:50 గంటలకు అమీర్‌పేట మైత్రివనం వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో ఎల్‌బీనగర్ కొత్తపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భావన విధులు ముగించుకుని కారులో ఇంటికి వెళ్తూ మైత్రివనం వద్ద ప్రసాద్ బైకును ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన ప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రసాద్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

PUBLIC NOTICE

TO WHOMSOEVER I MAY CONCERNED.

The general public are hereby informed that our client Mrs. Ghousiya Begum, W/o. Syed Farid Baba, age: 39 years, Occ: Pvt. Employee, R/o. H.No: 8-3-231/C/42, Sri Krishna Nagar, Yousufguda, Khairatabad, Hyderabad, Telangana -500045, is intending to purchase house property bearing no. 8-3-224/11/8 (H-13), (PTIN NO. 1100816696) on plot no. 8, (H-13) in Sy. NO. 26 admeasuring 111.00 sq. yards (or) 92.79 Sq. mts. situated at Madhura Nagar, Yousufguda, Hyderabad, Telangana State, belongs to Smt. M. Raja Hamsa Rajesh, W/o. Sri Molugu Rajesh, aged about 45 years, Occ: House wife, R/o. H.No: 6-1-112, Padmarao Nagar, Secunderabad, Hyderabad, Telangana State.

Our above named client has already concluded negotiations and intending to enter into appropriate documents/sale deed with the above named owner of the above mentioned house property. In case anybody have got any objection in the matter or has got any claim of whatsoever nature with the title and possession over the above mentioned lands or any part thereof, they may contact us at the below given address along with their objection or claims along with supporting material original documents within one week from the date of publication of this notice, failing which our client will proceed with her intended action in respect of the above house property with the above owner treating the above house property as free from 3rd party claims. Any objections or claims received thereafter shall not be binding on my client.

Sd/- BUJJIBABU DAVULURI
& Smt.M.Punyavathi, Advocates, Flat No. 307, E- Block, Sri Balaji Indraprasth Appts. Gandhi Nagar, Bakaram, Musheerabad, Hyderabad-500080 Cell 7893371911.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న ప్రీతం, తదితరులు

కిలిమంజారోను అధిరోహించిన నగర విద్యార్థి

● పిన్నవయస్కునిగా రికార్డు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన డిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రీతం గోలి(16) మౌంట్ కిలిమంజారోను అధిరోహించాడు. నగరం నుంచి ఈ ఫీట్‌ను సాధించిన అతి పిన్నవయస్కునిగా రికార్డులకెక్కాడు. ఎనిమిది రోజులపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని మౌంట్ కిలిమంజారోను జూలై 17న అధిరోహించినట్లు ప్రీతం తెలిపారు. ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్న అతను సత్యరూప్ సిద్ధాంత్ మార్గదర్శకత్వంలో నలుగురు క్లైంబర్స్‌తో ఈ యాత్ర పూర్తి చేశాడు. కిలిమంజారో పర్వతంపై జాతీయ పతాకంతో పాటుగా ఎన్‌సీసీ ఫ్లాగ్, తన స్కూల్ ఫ్లాగ్స్‌ను ఎగురవేసినట్లు తెలిపాడు. ఈ పర్వతాన్ని అధిరోహించిన తొలి ఎన్‌సీసీ కేడెట్ కూడా తానే అని ఈ సందర్భంగా అతను వెల్లడించాడు.


క్రీడాకారిణికి ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న తలసాని సాయికిరణ్ యాదవ్

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

● తలసాని సాయికిరణ్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు చేయూతను అందించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని యువ నాయకులు తలసాని సాయి కిరణ్‌యాదవ్ కోరారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని తమ నివాసం వద్ద మహిళా పవర్‌లిఫ్టర్ వైష్ణవి మహేష్‌కు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో 2లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వైష్ణవి మహేష్ ఎంపికైంది. ఈ పోటీలకు హాజరయ్యేందుకు ఆర్థికంగా కొంత ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న తలసాని ట్రస్ట్ ద్వారా 2లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాగా రక్షాబంధన్‌ను పురస్కరించుకుని వైష్ణవి సాయికిరణ్ యాదవ్‌కు రాఖీ కట్టింది.

ఆలయ దర్శనంతో మనసుకు ప్రశాంతత

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ఆలయ దర్శనంతో మనస్సుకు స్వాంతన చేకూరుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ శ్రీగణేష్ దేవాలయంలో పన్నెండు సంవత్సరాలకు ఒకమారు నిర్వహించే మహా కుంబాభిషేకము పూజలలో పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యేను అర్చకులు, ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించి, గణేశుడిని దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సత్యనారాయణ,సదానంద, అశోక్, వినోద్, శ్రీశైలం, బద్రీనాథ్, తేజ్‌పాల్, నగేష్, సంతోష్ పాల్గొన్నారు.

డాన్‌బాస్కో ఆధ్వర్యంలో రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఎన్సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) డాన్‌బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. డాన్ బోస్కో డిగ్రీ కాలేజీలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్ మేళా కొనసాగనున్నది. ఈ మేరకు దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కో ఆర్డినేటర్లు ఐవనోవాజ్, టీ.కార్తిక్, జిల్లా ఎన్‌పీఎస్ అధికారి విజయ్ కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూలు చేసి.. ఎంపిక చేస్తామని, మరిన్ని వివరాల కోసం 9494092219 నెంబర్‌ని సంప్రదించాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌డెస్క్ నంబర్ 155326

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్ హెల్ప్‌డెస్క్‌ను మూసివేశారు. దానికి ప్రత్యామ్నాయంగా పీడబ్ల్యూడీ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేశారు. ట్రాన్స్‌జెండర్స్ తమ సమస్యలను 155326 నంబర్‌కు తెలియజేయాలని సంబంధిత అధికారులు సూచించారు.



సామూహిక యజ్ఞోపవీతధారణ నిర్వహించిన బ్రహ్మశ్రీ అమరనాథ్ శర్మ

త్రిశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో

సామూహిక యజ్ఞోపవీత ధారణ

మల్కాజిగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకుని త్రిశక్తి సేవా సమితి మల్కాజిగిరి ఆధ్వర్యంలో సోమవారం ఆనంద్‌బాగ్‌లోని కనకరాజుతోట(శంకరమఠం)లో సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ అమరనాథ్‌శర్మ సమితి ప్రతినిధులు ఎం. సూర్యకుమారి, కె.రవి, ఎం.శైలజ, ఎస్.శేషకుమార్, సమయ, రామసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

మల్కాజిగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. శంకరయ్యజైన్, రాజిరెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ శర్మ, సాయిశర్మ నేతృత్వంలో హోం జరిగింది. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. పురాణపండ శ్రీనివాస్ రచించిన విష్ణుసహస్రనామ, లలిత సహస్రనామ స్తోత్ర పారాయణ పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

మల్కాజిగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయ రాఘవేంద్రస్వామి వారి 353వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వెంకటేశ్వరనగర్‌లోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఈనెల 23 వరకు ఆరాధనోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం పూర్వారాధన కార్యక్రమంలో భాగంగా కనకమహాపూజ, అష్టోత్తర సహిత విశేషఫలపంచామృత అభిషేకం, మహామంగళ హారతి నిర్వహించారు.


మహేంద్రాహిల్స్‌లో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణకు రాఖీ కడుతున్న తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు పుష్పారెడ్డి


మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ భవన్‌లో రాఖీ కట్టిన మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత


సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి శకుంతలమ్మ

లష్కర్‌లో ఘనంగా రక్షాబంధన్

సికింద్రాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు లష్కర్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని కాలనీలు, బస్తీల్లో రాఖీ పండుగను అన్నివర్గాల ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, ఆయా రాజకీయ పార్టీల నాయకుల నివాసాలు, కార్యాలయాలు రాఖీ పండుగను పురస్కరించుకుని కళకళలాడాయి. మహిళలు, యువతులు తమ అభిమాన నాయకులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావుగౌడ్, కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌లకు పలువురు మహిళలు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. జంపన ప్రతాప్‌కు ఆయన అక్కాచెల్లెళ్లతోపాటు మెప్మా మహిళలు రాఖీలు కట్టి, ఆశీర్వాదం అందుకున్నారు.


సనత్‌నగర్ బీకే గూడలో నివసిస్తున్న సీనియర్ బీజేపీ నాయకుడు ఆకుల బాల నరసింహ నివాసానికి వచ్చిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాఖీ కడుతున్న ఆకుల మహేష్ మాతృమూర్తి ఆకుల విజయ. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు దయానంద్ రిషికేశవశ్రీనివాసరావు, సుమన్ కుశాల్, నరేష్, రజనీష్, రమేష్ పాల్గొన్నారు.

\- సనత్‌నగర్,ఆంధ్రజ్యోతి


మిలటరీ అధికారులకు రాఖీ కడుతున్న కావ్యరెడ్డి

తిరుమలగిరి మిలటరీ ఆస్పత్రిలో రాఖీ సందడి

తిరుమలగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి సోమవారం తిరుమలగిరిలో ఉన్న మిలటరీ ఆస్పత్రిలో ఉన్న అధికారులు, వైద్య చికిత్స పొందుతున్న రోగులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు.


జంపన ప్రతాప్‌కు రాఖీ కడుతున్న సోదరి


కంటోన్మెంట్ పికెట్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు రాఖీ కడుతున్న మహిళలు


రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్‌కు రాఖీ కడుతున్న కంటోన్మెంట్ మహిళలు

'హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి'

బౌద్ధనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో ఆర్జీకార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై దారుణ ఘటనకు నిరసనగా సోమవారం సీతాఫల్‌మండిలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ ముఖ్యఅతిథిగా పాల్గొని కుట్టివెల్లోడి ప్రభుత్వ వైద్యశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కొంతమంది సోదరులకు రాఖీలను కట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రత్యూష, లాస్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బౌద్ధనగర్ న్యూఅశోక్‌నగర్‌లో మహాజన సోషలిస్ట్ పార్టీ, న్యూ అశోక్‌నగర్ అర్బన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాశ్ ముదిరాజ్, సభ్యులు పర్వతాలు, బాచి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో కొవ్వొత్తుల ర్యాలీలో కార్పొరేటర్ సామల హేమ

లాల్‌బజార్‌లో పీస్ ర్యాలీ

తిరుమలగిరి : కోల్‌కత్తాలోని ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యవిద్యను అభ్యసిస్తున్న వైద్యవిద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని వెంటనే చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని కోరుతూ లాల్‌బజార్‌లో టైగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. లాల్‌బజార్‌కు చెందిన పౌరులు మహిళలు పెద్ద ఎత్తున క్యాండిల్ ర్యాలీలో పాల్గొని నిందితుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాకాళి దేవాలయం అధ్యక్షులు మురళీముదిరాజ్, నిరంజన్, నాగేష్, టైగర్ అసోసియేషన్ సభ్యులు అనుభవ్ పాల్గొన్నారు.


లాల్‌బజార్‌లో పీస్ ర్యాలీ నిర్వహిస్తున్న టైగర్ అసోసియేషన్ సభ్యులు


సికింద్రాబాబాద్ సివిల్ కోర్టులో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదిపై దాడి చేసిన

ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలి

● వసంత్ కుమార్

అడ్డగుట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అకారణంగా ఓ న్యాయవాదిపై దాడికి పాల్పడిన బోరబండ ఎస్సైపై వెంటనే కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసుల దాడులు విరివిగా జరుగుతున్నాయని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఈనెల 16న సంతోష్‌కుమార్ అనే న్యాయవాది బోరబండలో ఓ ఇంట్లో అద్దెకుఉంటున్నాడు. ఇంటి యజమాని మొదటి అంతస్థులో ఉంటుంది. ఉదయాన్నే బోరబండ ఎస్సై జమాలతో పాటు కానిస్టేబుళ్లు సంతోష్ ఉన్న ఇంటికి వచ్చారు. మొదటి అంతస్థులో ఉన్న ఇంటి యజమాని గంజాయి విక్రయిస్తుందని తెలిసి వచ్చిన పోలీసులు కింద గేటు తీయమని న్యాయవాది సంతోష్‌ను కోరారు. ఇది గమనించిన ఇంటి యజమాని పోలీసుల్ని చూసి పారిపోయాడు. నీవు తాళం తీయకపోవడం కారణంగానే ఇంటి యజమాని పారిపోయిందని పోలీసులు ఆగ్రహంతో న్యాయవాది సంతోష్‌పై ఇష్టం వచ్చినట్లుగా దాడి చేసి చెయ్యి విరగొట్టారు. ఇలాంటి ఘటనలో గతంలో సిద్దిపేట్, జనగాంలో న్యాయవాదులపై పోలీసులు దాడులు చేశారని, న్యాయవాదలకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. న్యాయవాది సంతోష్ కుమార్‌పై దాడి చేసిన బోరబండ పోలీసుల్ని సస్పెండ్ చేయకపోతే ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు టీవీ రమణ, ప్రధాన కార్యదర్శి శుశీల్ కుమార్, న్యాయవాదులు బచ్చిబాబు, గంగాధర్ జెట్టి, ప్రవీణ్ కుమార్, నవీన్‌రెడ్డి, సౌమ్య, పుష్పలత, అన్నపూర్ణలతో పాటు తోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆపరేషన్ చేసి నా కూతుర్ని కాపాడండి

● సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ తల్లి మెసేజ్

అడ్డగుట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన కుమార్తెను కాపాడాలని వేడుకుంటూ ఓ తల్లి చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మెసేజ్‌లో పేర్కొన్న ప్రకారం.. బాధితురాలి పేరు సుశీల. ఆమె కూతురు జ్యోతి (25) ఈనెల 19న ఇంటి వద్ద ఐదో అంతస్తు నుంచి కింద పడిపోయింది. కొనప్రాణంతో కొట్టిమిట్టాడుతున్న జ్యోతిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. ఒకవైపు ఆమెను పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పగా.. కోల్‌కతా ఘటన నేపథ్యంలో మరోవైపు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహిస్తుండటంతో ఆపరేషన్ చేయడానికి వైద్యులు లేరని బాధితురాలు వాపోయింది. తన వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరోగ్యశ్రీ కార్డు ఉందని, అది ఇక్కడ పని చేయదని ఆవేదన చెందింది.

వైద్యం చేస్తున్నా నిందలా?

డాక్టర్ రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్

సోషల్ మీడియాలో బాధితురాలి పోస్ట్ వైరల్ కావడంతో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి స్పందించారు. గాంధీలోని వైద్యులు విధులు నిర్వహిస్తున్నా ఇలాంటి మేసేజ్‌లు రావడం తమకు బాధ వేస్తోందని అన్నారు. అంబర్‌పేట్‌కు చెందిన జ్యోతి అనే రోగిని ఈనెల 18 ఉదయం 8 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం క్యాజువాలిటీ వార్డుకు తీసుకొచ్చారని, ప్రాథమిక పరీక్షలో ఆమె మూర్ఛ రోగంతో బాధపడుతున్నట్టు తేలిందన్నారు. ఆమెకు ఎక్స్‌రే, సీటీ స్కాన్ నిర్వహించడంతో పాటు న్యూరో సర్జన్ వైద్యులు పరిశీలించారన్నారు. రోగికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా పర్వాలేదని, అవసరమైతే ఆస్పత్రి నిధులు వెచ్చించి వైద్యం చేస్తామన్నారు.


యూపీఎస్సీ అలిండియా మూడో ర్యాంక్ సాధించిన అనన్యను అభినందిస్తున్న దివ్యానగర్ కాలనీవాసులు

బెడ్‌రూమ్ డోర్ లాక్ చేసుకుని చిక్కుకున్న చిన్నారి

●తలుపు పగులగొట్టి కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

సనత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఆడుకుంటున్న రెండేళ్ల పిల్లవాడు తెలియక బెడ్ రూమ్ డోర్‌ను లాక్ చేసి లోపల చిక్కుకుపోయాడు. తలుపు తెరవడం చాతకాక బెడ్‌రూమ్‌లో ఏడుస్తూ ఉండిపోయాడు. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది తలుపులు బద్దలుకొట్టి బాలుడిని కాపాడారు. సనత్‌నగర్ ఎస్ఆర్టీ కాలనీలో నివసిస్తున్న షరీఫ్ కుమారుడు షేక్ హాసిల్ మొహిద్దీన్ ఆడుకుంటూ బెడ్ రూమ్‌లోకి వెళ్లి డోర్ లాక్ చేసుకున్నాడు, 20 నిమిషాల పాటు అతని తల్లిదండ్రులు చుట్టుపక్కలవారు ప్రయత్నించి తలుపు ఎంతకూ రాకపోవటంతో, 101కు ఫోన్ చేశారు. సమాచారమందుకున్న సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని, తలుపు పగలగొట్టి బాలుడిని కాపాడారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది అధికారులను స్థానికులు అభినందించారు.


బాలుడిని కాపాడి తండ్రికి అప్పగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కదులుతున్న రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి


మృతిచెందిన ప్రయాణికుడు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు ఓ ప్రయాణికుడు కిందపడి అక్కడికక్కడే మరణించిన ఘటన లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి-లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలుపట్టాల వెంట గుర్తుతెలియని 35ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడని సమాచారం తెలుసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీరా అక్కడ పరిస్థితి చూస్తే రైలులో ఈ ప్రయాణికుడు ప్రమాదశాత్తు కాలు జారి కిందపడి చనిపోయినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే వెంటనే 8712658581 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మారేడుపల్లి పికెట్‌లోని ఆలయంలో జై సంతోషిమాత

వైభవంగా సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

మారేడుపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి పికెట్‌లోని జై సంతోషిమాత ఆలయంలో అమ్మవారి ప్రత్యేక పూజలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ ప్రతిష్ఠ, చండీ రుద్రమోహం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. అనతరం మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదం భక్తులకు అంజేశారు.


సంతోషి మాత అమ్మవారిని దర్శించుకుంటున్న నివేదిత

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంతోషిమాత అమ్మవారి జన్మదినం సందర్భంగా రెజిమెంటల్‌బజార్ కాశీ విశ్వనాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత, కార్పొరేటర్ కొంతం దీపికలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు అమ్మవారి దర్శనం అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణకుమార్, నళిని, అనిత, మురళి, గోపాల్, నందికంటి రవి, అజయ్, రామ్మోహన్, శ్రీను, ఈవో మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మహాకాళి ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం

మహాకాళి ఆలయంలో ఘనంగా చండీ హోమం

సికింద్రాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయంలో చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, అమ్మవారి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తామనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

మహాకాళి దేవాలయంలో అన్నదానం

తిరుమలగిరి : రాఖీ పౌర్ణమి పర్వదినంతోపాటు పౌర్ణమిని పురస్కరించుకొని లాల్‌బజార్‌లోని మహాకాళి దేవాలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు దేవాలయం అధ్యక్షులు మర్కంటి మురళీముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. లాల్‌బజార్ పెరుమాళ్ హట్స్, శాస్త్రీనగర్, కంటోన్మెంట్ క్వార్టర్స్, లాల్‌బజార్ మార్కెట్ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించడంతో పాటు సాయంత్రంపూట భజన కార్యక్రమాలు ఉంటాయని మురళీ ముదిరాజ్ తెలిపారు

గణేశ్ దేవాలయంలో మహా కుంబాభిషేకం

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): సికింద్రాబాద్ శ్రీగణేశ్ దేవాలయంలో పన్నెండు సంవత్సరాలకు ఒకమారు నిర్వహించే మహా కుంబాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవ సహిత మహా కుంబాభిషేక పూజలలో చివరి రోజు సోమవారం జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు అనంత శ్రీవిభూషితులు జగద్గురు అభినవోద్దండ విద్యాశంకరభారతీ మహాస్వామివారల కరకమలములచే మహాకుంబాభిషేకం నిర్వహించారు. అభినవోద్దండ విద్యాశంకరభారతీ మహాస్వామివారిచే అనుగ్రహభాషణము, శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి శాంతి కల్యాణము, అవభృథ స్నానం, మహాదాశీర్వచనము, పండిత సన్మానం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. మహా కుంబాభిషేక పూజలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కార్పొరేటర్ కొంతం దీపికపాల్గొన్నారు.


కుంబాభిషేకంలో జగద్గురు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364